ప్రతి హామీ ఆచరణలో అమలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న రమేష్‌బాబు

చల్లపల్లి: అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా ఆచరణలోకి తెస్తున్నామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. సోమవారం సాయంత్రం చల్లపల్లి-1 గ్రామ సచివాలయం పరిధిలోని స్థానిక నారాయణరావు నగర్, నిమ్మలతోట, పార్వతమ్మ తోట, షాబులు బజారు, పుట్ట బజారు, విజయ కాన్వెంట్ రోడ్, ఆలీ ఆసుపత్రి ఏరియాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ బాబు 871 ఇళ్లకు వెళ్లి వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ అవనిగడ్డ సభలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, కంపోస్ట్ యార్డ్ నిర్మాణం, కోడూరు - అవనిగడ్డ రోడ్డు, ఎదురుమొండి బ్రిడ్జి, ఔట్ ఫాల్ స్లూయిసులు నిర్మించి చూపిస్తామన్నారు. కృష్ణా డెల్టా ఆధునికీకరణ నిధులతో ఔట్ ఫాల్ స్లూయిసులు నిర్మించకుండా కాలువలకు గోడలు, వంతెన పక్కన వంతెనలు కట్టి కోడూరు, నాగాయలంక మండలాల్లో ముంపు సమస్యకు కారకులయ్యారని ధ్వజమెత్తారు. గత ఎమ్మెల్యేకు అభివృద్ధిపై అవగాహన లేక కృష్ణా డెల్టా నిధులు కూడా పూర్తిగా వినియోగించకపోవటంతో ఆ నిధులు మురిగిపోయాయన్నారు. కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇంచార్జి ఇంకొల్లు శేషగిరి, సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగ ఝాన్సీలక్ష్మి, సర్పంచులు డొక్కు నాగేశ్వరరావు, గొరిపర్తి సురేష్ బాబు, పీఏసీఎస్ చైర్మన్లు పేరం నాగిరెడ్డి, అరజా శివశంకర్, పాగోలు నాగ సీతారామారావు (ఫణి), తహసీల్దార్ కే.గోపాలకృష్ణ, ఇంచార్జి ఎంపీడీఓ అరుణకుమారి, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ అరుణ కుమారి, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సీహెచ్‌సీ డైరెక్టర్ ముత్యాల చిట్టబ్బాయి తదితరులున్నారు.

ప్రతి నోటా జగనన్నే మా భవిష్యత్..


పెడన పట్టణంలోని 2వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి


జగనన్న స్టిక్కర్ అతికించిన తరువాత మహిళలతో కృత్తివెన్ను జెడ్పీటీసీ రత్నకుమారి

పెడన: ప్రతి నోటా..ఇంటా కూడా జగనన్నే మా భవిష్యత్తు అంటూ పేర్కొంటున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని 2, 8, 11, 16, 17వ వార్డులలో నిర్వహించారు. 2వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్సరాణి, కౌన్సిలర్లు భళ్ల గంగయ్య, మెట్ల గోపీ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ ఫలాలు, ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాల్లోని వ్యత్యాసాలు వివరించారు. 8వ వార్డులో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావులతో పాటు పార్టీ నాయకులు, 11వ వార్డులో వార్డు ఇన్‌చార్జి ముత్యాల మురళి, కోడూరు శ్రీను, 16వ వార్డులో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, 17వ వార్డులో మెట్ల గోపీ ప్రసాద్‌లతో పాటు వార్డు వాలంటీర్లు, సచివాలయల సమన్వయకర్తలు, గృహసారథులు తిరుగుతూ ఇంటి యజమానుల ఆమోదంతో వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు.

కృత్తివెన్ను: మా నమ్మకం నువ్వే జగన్ అంటూ గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను వారి అనుమతితో అతికిస్తున్న కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. సోమవారం కృత్తివెన్ను మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు అనే తేడా లేకుండా అందరూ సైనికుల మాదిరి తమ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందో సమగ్రంగా వివరించారు. జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ కన్వీనర్ వెంకట్రాజు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం మచిలీపట్నంలోని 50 డివిజన్లలో ఉత్సాహంగా సాగింది. నగరంలోని ఆయా డివిజన్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఇంటింటికి వెళ్లి కార్యక్రమ వివరాలను ప్రజలకు వివరించారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్ల నేతృత్వంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు వెళ్లి కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించి సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. సీఎం జగన్ చిత్రపటంతో ముద్రించిన కార్యక్రమ స్టిక్కర్లను ఇంటి గోడలకు, సెల్‌ఫోన్ స్టిక్కర్లను వారి అనుమతితో అంటించారు. కార్యక్రమాల్లో పలు చోట్ల నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత థామస్ నోబుల్, లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల అండ దినాదినాభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మండల పరిధిలోని ఎస్ గొల్లపాలెం, పెదయాదర, గుండుపాలెం గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేర్ని కిట్టు పాల్గొన్నారు. గ్రామంలోకి అడుగుపెట్టిన కిట్టుకి డ్వాక్రా సంఘాల సభ్యులు పూలవర్షంతో స్వాగతం పలికారు. లబ్ధిదారులకు కిట్టు చేతుల మీదుగా రుణమాఫీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ అమలుచేస్తున్నారని చెప్పారు. అలాగే మహిళల సంక్షేమం కోసం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. అలాంటి గొప్ప నాయకుడికి వచ్చే ఎన్నికలలో అక్కాచెల్లెమ్మలంతా అండగా నిలవాలని కోరారు. బందరు నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు జడ్డు రాధాకృష్ణ, సారధి, శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ బి.తులసీధర్

గుడివాడ రూరల్: పట్టణంలోని నాగన్న చెరువు గట్టు వద్ద నివాసముంటున్న వేమన శ్రీనివాసరావు కుమారుడు పార్థసారథి (12) ఆదివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని బాలుడు తల్లిదండ్రులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. టూటౌన్ సీఐ బి.తులసీధర్ పర్యవేక్షణలో బాలుడి గురించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలుడి ఆచూకీ కనుగొని సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ తులసీధర్ విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో బాలుడు అదృశ్యమయ్యాడని ఫిర్యాదు రాగా తన సిబ్బంది రైల్వే, ఆర్పీఎఫ్ అధికారులకు తెలియచేశామన్నారు. కేవలం 5గంటల్లోనే బాలుడు విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే బాలుడిని తమ సిబ్బంది పట్టుకుని గుడివాడ తీసుకువచ్చారన్నారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. చిన్న, చిన్న గొడవలు, ఘర్షణల వల్ల పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోతున్నారని, అలా వెళ్లిపోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. తమ బిడ్డను తమకు అప్పగించిన సీఐ తులసీధర్, పోలీస్ సిబ్బందికి బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన


పెనమలూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థులు

పెనమలూరు: పంటల సాగు, మెలకువలపై అగ్రికల్చర్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. పెనమలూరులో సోమవారం ఒడిశా సెంచురియన్ విశ్వవిద్యాలయం బ్యాచిలర్ అగ్రికల్చర్ డిగ్రీ విద్యార్థినులు ఎస్.మహేశ్వరి, పి.శ్రీలేఖ, ఊర్మిల రైతులను కలిసి వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలకు పురుగు, తెగులు ఆశిస్తే వాటిని నివారించడానికి పిచికారి చేసే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని, మట్టి నమూనా సేకరణ, విత్తన శుద్ధి, సాగు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాగులో ఎదురవుతున్న సమస్యలను విద్యార్థినులు అడిగి తెలుసుకున్నారు.

చౌకధరల దుకాణం సీజ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులోని ఐదో నంబర్ రేషన్‌షాపును పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. మూడు నెలలుగా సక్రమంగా రేషన్ సరుకులు అందడం లేదని బియ్యం కార్డుదారులు ఫిర్యాదు చేయడంతో గన్నవరం పీడీఎస్ డిప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, రేషన్ సరుకుల నిల్వలను పరిశీలించారు. దీంతో రేషన్‌షాపులో 10.5 క్వింటాళ్ల బియ్యం, 19 కేజీల పంచదార తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రేషన్ షాపును సీజ్ చేయడంతో పాటుగా కేసు నమోదు చేస్తున్నట్లు డీటీ ప్రధాన్ తెలిపారు. బాపులపాడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, వీఆర్వోలు శివయ్య, శివ సాంబ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: పోరంకిలో వివాహిత కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందడంతో సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి తూముల సెంటర్‌లో ఉంటున్న బూరి రమాదేవి కుమార్తె సాగరికకు 2019లో వివాహమైంది, ఆమెకు భర్తతో విభేదాల కారణంగా పుట్టింట్లో ఉంటోంది. సాగరిక ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో తల్లి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

13న శివాలయంలో కానుకల లెక్కింపు

పెనమలూరు: కానూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంల్లో హుండీల్లోని కానుకల లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.జేశ్వంత్‌కేదార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు ఆలయ ముఖమండపంలో భక్తులు స్వామివార్లకు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు అధికారుల సమక్షంలో జరుపుతామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

పెడన: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. పెడనలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్‌లుగా చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఎంఈవో మెటల్దారాణి ఉన్నారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 694 విద్యార్థులకు గాను 687 మంది హాజరయ్యారని తెలిపారు. ఏడుగురు గైర్హాజరయ్యారన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

గన్నవరం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం గన్నవరం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన శెనగల శివనాగిరెడ్డి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో స్థానిక కోనాయి చెరువు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసరపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో స్థానికుడు కొండేటి అనిల్‌ను అదుపులోకి తీసుకుని అరకేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ కనకరావు తెలిపారు.

శ్రీవాసవీ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరుగుతాయని పరీక్షా కేంద్రం నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండో బ్యాచ్ వారికి ఉంటుందని పేర్కొన్నారు. 572 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, పరీక్షా కేంద్రం సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



పెదప్రోలు(మోపిదేవి): చల్లపల్లి వైపు నుంచి మోపిదేవి వస్తున్న కంటైనర్ అదుపుతప్పి పక్కనే ఉన్న గ్రిల్స్‌ను ఢీ కొనడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి ఎదురుగా ఉన్న ఆటోను తప్పించబోయి కంటైనర్ గ్రిల్స్‌ను ఢీకొట్టింది. సమీపంలో ఉన్న రెస్టారెంట్‌కు వచ్చే వాహనాలు రోడ్డు పక్కన నిలిపివేయడంతో రాత్రి పూట వచ్చే వాహనాలకు తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. కంటైనర్ లారీ గ్రిల్స్‌ను ఢీకొని ఆగకపోతే నేరుగా రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లేదని సమీపంలోని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాయి లోహిత్‌కు నివాళి



చల్లపల్లి: కృష్ణానదిలో మునిగి మృతి చెందిన విద్యార్థి కొల్లిపర సాయి లోహిత్ (22) మృతదేహాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సందర్శించి నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య బజారుకు చెందిన లోహిత్ తుళ్లూరు మండలం రాయపూడి పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో ఈతకు వెళ్లి గల్లంతై మృతి చెందాడు. విట్ యూనివర్సిటీలో లోహిత్ బీటెక్ చదువుతూ స్నేహితులతో కలిసి ఆదివారం నది వద్దకు వెళ్లి ఈ ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

లంకమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.80 లక్షలు

అవనిగడ్డ: లంకమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.7,80,293 వచ్చినట్టు ఆలయ ఈవో పి.సీతారామయ్య తెలిపారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అమ్మవారి జాతర పూర్తయిన సందర్భంగా గత నెల 27వ తేదీ నుంచి సోమవారం వరకూ వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మచిలీపట్నం దేవదాయశాఖ తనిఖీ అధికారి శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్‌తో పాటు పలువురు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమం

చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఇన్‌చార్జ్ డెప్యూటీ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పెడన రోడ్డులోని వలందపాలెంలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో జయంతి నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, వెనుకబడిన తరగతుల సంఘ నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

కాల్‌మనీ కేసులో టీడీపీ నేత కుమారుడిపై ఫిర్యాదు

కోనేరుసెంటర్: బందరు మండలం కానూరు గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ కుమారుడు గోపు ప్రతాప్ నరేష్‌పై ఓ బాధితుడు కాల్‌మనీ కేసు కింద స్పందనలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న సారాంశం ఈ విధంగా ఉంది. బందరు మండలం జొన్నలవారిమోడి గ్రామానికి చెందిన అడ్డాల వెంకన్న అనే యువకుడు బైక్ కొనేందుకు రెండు సంవత్సరాల క్రితం గోపు ప్రతాప్ నరేష్ వద్ద రూ. 10,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పటి నుంచి నూటికి రూ. 10 చొప్పున వడ్డీతో పాటు అసలు కట్టుకుంటూ వచ్చాడు. అప్పు తీసుకున్న సమయంలో నరేష్ బాధితుడి వద్ద ఖాళీ ప్రామిసరీనోటుతో పాటు రెండు చెక్‌లు తీసుకున్నాడు. అయితే అప్పు తీర్చినప్పటికీ నరేష్ మరో మూడు లక్షల వరకు అప్పు కట్టాల్సి ఉందని మానసికంగా వేధిస్తున్నాడు. కాల్‌మనీ వేధింపులు తట్టుకోలేని అడ్డాల వెంకన్న సోమవారం స్పందనలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. వేధింపుల నుంచి కాపాడకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ పేర్కొన్నాడు. కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న నరేష్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని విన్నవించాడు. కేసును అధికారులు బందరు రూరల్ పోలీసులకు సిఫార్సు చేశారు.

పెరటి పంటలు వేయండి

పెనమలూరు: భూమి లేని వారు ప్రకృతి వ్యవసాయం, ఇంటి ఆవరణలో పెరటి పంటలు సాగు చేయాలని రైతు సాధికారత సంస్థ అధికారి అరుణ అన్నారు. వణుకూరు గ్రామంలో సోమవారం స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆమె ప్రసంగించారు.

విద్యాలయానికి రూ. 1.50 కోట్ల నిధులు మంజూరు


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నంటౌన్: నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం ప్రారంభించారు. విద్యాలయానికి వచ్చిన ఎంపీ బాలశౌరిని చిన్నారులు గౌరవ వందనంతో స్వాగతం పలికి తోడ్కని వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ. 1.50 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విద్యాలయం సిబ్బంది కోరటంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ. 10 లక్షలతో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 17 కంప్యూటర్లతో ఈ ల్యాబ్‌ను సిద్ధం చేశామని పేర్కొన్నారు. 800 మందికి పైగా విద్యార్థులు ఉన్న విద్యాలయంలో సైన్స్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూమ్, ప్లేగ్రౌండ్ అభివృద్ధికి ఇతర పనుల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులు తాము అడగకుండానే మంజూరు చేయటం పట్ల విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విద్యార్థులు, సిబ్బంది ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు అంజత్‌బాషా, మాదివాడ రాము, టిడ్కో డైరెక్టర్ పత్తిపాటి రాఘవ (చిన్నారి), సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ


పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా అధికార యంత్రాంగం నేతృత్వంలో సహాయ ఫౌండేషన్ ద్వారా సోమవారం పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. నిరుపేదలకు ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అధికారుల సహకారంతో రూ. 25 వేలు ఇటీవల సహాయ ఫౌండేషన్‌కు నగదును అందజేశారు. జిల్లా యంత్రాంగం ఇచ్చిన నగదుతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ఎంతో మంది పేదలు ఆహారం లేక అలమటిస్తూ ఉంటారని వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించటం అభినందనీయమన్నారు. ఫౌండేషన్‌కు తన వంతు సహకారంగా రూ. 5వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, న్యాయవాది బాలాజీ, బొమ్మిడి అయ్యప్పస్వామి, రౌతుల ప్రసాద్, కోన వెంకటేశ్వరమ్మ, తోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబొరేటరీ మాన్యువల్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపకులపతి ఆచార్య రామమోహనరావు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి రచించిన ఆర్గానిక్ కెమిస్ట్రీ ల్యాబొరేటరీ మాన్యువల్ పుస్తకాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.రామమోహనరావు సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తకాన్ని రచించిన రచయిత రామశేఖరరెడ్డిని ఉపకులపతి కె.రామమోహనరావు ప్రత్యేకంగా అభినందించారు. నూతన విద్యావిధానం అనుసరించి రచించిన పుస్తకంలో రసాయనశాస్త్ర విద్యార్థులు పరిశోధనలలో పాటించాల్సిన సురక్షిత విధానాలతో పాటు అనేక కృత్యాల గురించి విపులంగా వివరించామని రామశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ పుస్తకాన్ని తన గురువు పూర్వ రసాయనశాస్త్ర ఆచార్యులు వెంకటేశ్వర్లుకు అంకితమిస్తున్నట్లు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


రమీజాకు నగదు అందజేస్తున్న పింఛనుదారులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 28వ డివిజన్‌లో పింఛనుదారులైన అబ్దుల్ సాబేరున్నీసా, షేక్ ముంతాజ్‌బేగంలు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను ఆదుకునేందుకు ఆ డివిజన్‌లోని తోటి పింఛనుదారులు రూ. 100 చొప్పున సేకరించి వచ్చిన రూ. 36,300 మృతుల కుటుంబాలకు సాయంగా అందించారు. ఒక్కొక్క మృతుడి కుటుంబానికి రూ. 18,150 చొప్పున ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ షేక్ మహమ్మద్‌సాహెబ్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా మహమ్మద్‌సాహెబ్ మాట్లాడుతూ తోటి పింఛనుదారులు మృతి చెందటంతో డివిజన్‌లోని పింఛనుదారులు వారి కుటుంబాల వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు రూ. 100 చొప్పున ఇచ్చి ఆదుకోవటం అభినందనీయమన్నారు.

దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆశీర్వచనాలు


దేవాదాయశాఖ కమిషనర్‌కు సుబ్బారాయుడి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

మోపిదేవి: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణను చల్లపల్లి ఎస్టేట్ ఆలయాల అసిస్టెంట్ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ దేవస్థానం సిబ్బందితో సోమవారం విజయవాడ గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాకప్పి, స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందచేశారు. ఆలయ వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత'కు విశ్రాంత ఉపాధ్యాయుడి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖకు విశ్రాంత ఉపాధ్యాయుడు నెక్కంటి చిన్న సత్యనారాయణ రూ.25 వేలు విరాళాన్ని సోమవారం అందించారు. మానవత అందిస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడై తనవంతుగా సాయం అందించాలని విరాళంగా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మొత్తాన్ని మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావుకు అందించారు.

హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, సుబ్బాచారి, కంభంపాటి నాగేశ్వరరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543, 79950 92116 (మచిలీపట్నం, పెడన)
99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com